రాజన్న ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వినోద్‌రెడ్డి

వినోద్‌రెడ్డి

వేములవాడ, జూన్ 30: వేములవాడ రాజన్న ఆలయ ఇన్‌చార్జిగా ఈవో వినోద్‌రెడ్డిని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణప్రసాద్ సెలవులపై వెళ్లగా ఆర్జేసీ రామకృష్ణ ఆదివారం వరకు ఇన్‌చార్జిగా ఈవోగా పని చేశారు. ఆషాఢ మాసం బోనాలు సమీపిస్తున్నందున దీనికి ప్రత్యేక అధికారిగా ఉన్న రామకృష్ణ వాటి బాధ్యతను చూసుకోవాల్సి ఉన్నందున ఆయన ఆదివారం రిలీవ్ అయి హైదరాబాద్ చేరుకోనున్నారు. అయితే కృష్ణప్రసాద్ తనకు ఆరోగ్యం సహకరించడం లేదంటూ మరికొంత కాలం సెలవు కావాలని కోరిన నేపథ్యంలో సికింద్రాబాద్ గణేశ్ దేవాలయం ఈవోగా పనిచేస్తున్న వినోద్‌రెడ్డిని ప్రస్తుతం వేములవాడ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీ గడువు పెంచాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ

వేములవాడ, జూన్ 30 : ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల వెబ్ ఆప్షన్ గడువు సమయం పెంచాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా ఎస్జీటీ బదిలీ ఆప్షన్లు ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అయితే పేర్ల సంఖ్యలో ఉన్న వీరికి కూడా రెండ్రోజుల గడువు ఇవ్వడంతో సర్వర్ సరిగా పనిచేయక ఉపాధ్యాయులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. మరో మూడు రోజులు గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడులను తిరిగి ప్రారంభించేందుకు బడి ఉన్నచోట ఉపాధ్యాయ పోస్టును ఆన్‌లైన్‌లో చూపాలని, కొందరు అధికారులు, అనధికారులు రేషనలైజేషన్ చేస్తున్నందున దానిని వెంటనే ఆపాలన్నారు. సీఎం ప్రాథమిక పాఠశాల ఉన్నచోట ఉపాధ్యాయ పోస్టులు చూపాలని, సూచించిన వెబ్ ఆప్షన్‌లో మాత్రం అధికారులు ఆన్‌లైన్‌లో పదుల సంఖ్యలో కనిపించకుండా మాయం అవడానికి కారణం చెప్పాలన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉన్న ప్రతిచోట ఉపాధ్యాయ పోస్టును ఆన్‌లైన్‌లో చూపాలని డిమాండ్ చేశారు. అలా చూపకపోతే ఎస్జీటీ ఉపాధ్యాయులకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున తప్పనిసరిగా చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

క్రికెట్ అభిమానుల సంబురాలు

జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రికెట్ అభిమానులు

చందుర్తి, జూన్ 30: టీ 20 వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత్ విజయం సాధించడంపై మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సంబురాలు నిర్వహించారు. ప్రధాన బస్టాండ్ కూడలి వద్ద నుంచి జాతీయ జెండాలతో జయహో భారత్ అంటూ యువకులు క్రీడాకారులు, గ్రామంలో ర్యాలీ తీశారు. చౌరస్తాలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఇక్కడ స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎండీ అజీమ్, సీనియర్ క్రీడాకారుడు జాకీర్, వెంకీ, యాకూబ్, కైర తిరుపతి, లింగం, పిట్టల బాబు, యువకులు హరి, రాంబాబు, సూర్య, సిరికొండ తిరుపతి, సిరి క్రీడాభిమానులున్నారు.

రుద్రంగిలో రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

రుద్రంగి, జూన్ 30: రుద్రంగి మండల కేంద్రంలో రుద్రంగి బ్లడ్ డోనర్స్, సిరిసిల్ల సివిల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో మండలానికి చెందిన యువకులు, గ్రామస్తులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రుద్రంగి బ్లడ్ డోనర్స్ సభ్యులు మాట్లాడుతూ, ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు రక్తం దొరకడం లేదన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానంతో ఒకరి ప్రాణం నిలబెట్టచ్చన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల పల్లె దవాఖానలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి బ్లడ్ డోనర్స్, సిరిసిల్ల సివిల్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

వేములవాడలోని గీత విద్యాలయంలో పూర్వ విద్యార్థులు

వేములవాడ, జూన్ 30: వేములవాడ పటణంలో గీత విద్యాలయంలో 1998–99 సంవత్సరంలో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వేములవాడలోని మహదేవ్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ ఆయాచితుల రాంప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని ప్రస్తుత అనుభవాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, పాఠశాలలో స్నేహితులు పదో తరతగతి వరకు కలిసి ఉంటారని, వారి బంధం విడదీయలేనిదన్నారు. చిన్ననాటి స్నేహితులను 25 సంవత్సరాల తర్వాత తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, భానుప్రకాశ్, పూర్వ విద్యార్థులు సీఐ(ఆర్) సంపత్ కుమార్, వేములవాడ మున్సినల్ చైర్‌పర్సన్ మాధవి, వేములవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్, లయన్స్ క్లబ్ పట్టణాధ్యక్షుడు కట్కం శ్రీనివాస్, కిషోర్ కుమార్, క్రాంతికుమార్, ఉపేందర్, తిరుపతి, మధు, రాజేంద్రప్రసాద్, నరేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అనిల్‌కుమార్, సతీశ్‌కుమార్, సుమ, సంధ్య, వరలక్ష్మీ, సునీత తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవతోనే గుర్తింపు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ఎంపీటీసీలను సన్మానిస్తున్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

చందుర్తి, జూన్ 30: ప్రజాక్షేత్రంలో చేసిన సేవలే తగిన గుర్తింపునిస్తాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చివరి సర్వసభ్య సమావేశాల్లో ముఖ్య అతిథిగా జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాసేవలో చేసిన పనులే గుర్తింపునిస్తాయన్నారు. ప్రజాప్రతినిధులుగా రాణించాలంటే ప్రజా సమస్యలపై సునిశిత దృష్టి ఉండాలన్నారు. ఎంపీటీసీలుగా, కో ఆప్షన్ సభ్యుడుగా ఐదేళ్ల కాలంలో ప్రజలతో మమేకమవడం అదృష్టమని తెలిపారు. బడుగు బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీటీసీలు, కో ఆప్షన్ మెంబర్లను ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను అందజేశారు. ఇక్కడ జడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీపీ బైరగోని లావణ్య, వైస్ ఎంపీపీ అబ్రహం, ప్యాక్స్ చైర్మన్లు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్‌రావు, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, ఎంపీటీసీలు మ్యాకల గణేశ్, పులి రేణుక, వేల్పుల వనజ, పెగ్గర్ల రమేశ్ రావు, గడ్డం రణధీర్ రెడ్డి, దారం కావ్య శ్రీ, కోఆప్షన్ మెంబర్ బత్తుల కమలాకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్‌కుమార్, రమాదేవి, ఎమ్మార్వో శ్రీనివాస్ ఉన్నారు.

రోమాల లక్ష్మణ్ వర్ధంతికి హాజరు

వేములవాడ రూరల్, జూన్ 30: వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి రోమాల లక్ష్మణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోమాల లక్ష్మణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే సామాజిక కార్యక్రమాలను రోమాల ప్రవీణ్ చేపట్టారన్నారు. కాగా,పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి, బహుమతులను అందజేశారు. అలాగే కళాకారులను సన్మానించి డప్పులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొస్కుల రవి, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్‌గౌడ్, ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ, కార్యదర్శి మల్లేశం, బొడ్డు రాములు, పరశురాములు, శ్రీనివాస్, సోమినేని బాలు, రాజు, హెచ్ ఎం సదానందం,గ్రామస్తులున్నారు.

పోడు భూమి విషయంలో వివాదం

- ఇరువర్గాల గిరిజనుల మధ్య ఘర్షణ
- కర్రలతో దాడుల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

ఘర్షణలో గాయపడ్డ గిరిజనులు

వీర్నపల్లి, జూన్ 30: పోడు భూముల విషయమై గిరిజనుల మధ్య ఘర్షణ తలెత్తింది. కర్రలతో దాడి చేసుకోవడంతో ఇద్దరి తలలు పగిలి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని భూక్యా తండా పరిధి రాశిగుట్టతండా అటవీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన లకావత్ వసంత్ 1.20 ఎకరాలు, భూక్యా సరయి 4 ఎకరాల పోడు భూమిని సాగు చేసుకుంటున్నారు. వీరికి పోడు పట్టాలు కూడా ఉన్నాయి. ఆదివారం పోడు భూమిలో ఇద్దరికి సంబంధించిన సరిహద్దు విషయంలో గొడవ జరిగింది. గొడవ విషయం తెలుసుకున్న వసంత్ కుమారులు రవి, తిరుపతి, సరయి కుమారుడు నవీన్, సోదరుడు మోహన్‌లు అక్కడికి చేరుకున్నారు. దీంతో మాటామాటా పెరిగి ఘర్షణ తీవ్రమై రెండు వర్గాలు కర్రలతో ఒకరికొకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో తిరుపతి, వసంత్, నవీన్ తలలు పగులడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఇరువర్గాలు గాయాలతో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రధాన దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ రమేశ్‌ను వివరణ కోరగా, ఎవరూ ఫిర్యాదు చేయలేదని, గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

మహిళా కళాశాలలో ఐపీఆర్, ఎంటర్‌పెన్యూర్ షిప్‌పై అవగాహన

సిరిసిల్ల రూరల్, జూన్ 30 : తంగళ్లపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఐపీఆర్, ఎంటర్‌పెన్యూర్ షిప్‌లపై ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. ఇనిస్టిట్యూషన్స్, ఇన్నోవేషన్ కౌన్సిల్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ , ఏఐసీటీఈ ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహించారు. గెస్ట్ స్పీకర్స్ బండారు నవీన్‌కుమార్, చేపూరి అభినయ్ కుమార్ హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజని, వైస్ ప్రిన్సిపల్ సుదా సింధు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి వృద్ధురాలి మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 30: రాజన్నపేటలో శివారులో ఆటో బోల్తాపడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. కోనరావుపేట మండలం ధర్మారానికి చెందిన బొడ్డు చంద్రవ్వ(60) గొల్లపల్లిలో రాజన్నపేటకు చెందిన బంధువు లింటికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఆమెతో పాటు మరో ఎనిమిది మందితో కూడిన ఆటో రాజన్నపేటకు చేరుకోగానే డ్రైవర్ వేగంతో మలుపుతిప్పి క్రమంలో ఆటోబోల్తాపడింది. దీంతో చంద్రవ్వకు తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో వారిని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించే క్రమంలో చంద్రవ్వ మృతి చెందగా నమిలికొండ లావణ్య, నిమ్మపల్లి వజ్రవ్వకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పర్స్ అందజేత

వేములవాడ రూరల్, జూన్ 30: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ పర్స్ పోగొట్టుకోగా అందజేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఆర్టీసీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్‌కు ఓ పర్స్ దొరికగా బస్టాండ్‌లో అధికారులకు తెలిపాడు. మైక్‌లో వివరించి పోగొట్టుకున్న మహిళకు పర్స్‌ను అందజేశారు. రాజ్‌కుమార్ నిజాయితీని ఆర్టీసీ అధికారులతోపాటు ప్రయాణికులు అభినందించారు.

భూ ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు

ట్రాక్టర్‌తో తొలగించిన మొక్కలను చూపిస్తున్న ముదిరాజ్ కులస్తులు

కోనరావుపేట, జూన్ 30: మండలంలోని బావుసాయిపేట గ్రామంలో ముదిరాజ్ కులానికి చెందిన 5 ఎకరాల భూమిని చదును చేసిన వ్యక్తిపై ముదిరాజ్ కులస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం, 15 సంవత్సరాలుగా ఐదెకరాల పోడు భూమిని సాగుచేసి అందులో సీతాఫలాలు, దానిమ్మ, ఉసిరి, జామ చెట్లతో పాటు పలు రకాల పండ్ల చెట్లను పెంచుతున్నామన్నారు. గ్రామంలోని జంగం పద్మయ్య భూమిని ట్రాక్టర్‌తో చదును చేసి, పండ్ల మొక్కలను పూర్తిగా ధ్వంసం చేశాడన్నారు. అతనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. భూ ఆక్రమణకు పాల్పడిన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ ఆంజనేయులును కోరారు.

మైనర్లు వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు

- వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి

వేములవాడ, జూన్ 30: మైనర్లు వాహనాలు నడిపితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని వారి భద్రతను తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలని వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మైనర్ డ్రైవింగ్ 102, వితౌట్ డ్రైవింగ్ లైసెన్స్ 194, సెల్‌ఫోన్ డ్రైవింగ్ 156, వితౌట్ నంబర్ ప్లేట్ 241, డ్రంక్ అండ్ డ్రైవ్ 126, ఓపెన్ డ్రింకింగ్ 124 వితౌట్ హెల్మెట్ 280 ఇలా మొత్తం 1,223 కేసులు చేసినట్లు తెలిపారు. మైనర్ పిల్లలు వాహనాలు నడిపితే ఇకపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వారి భద్రత తల్లిదండ్రుల బాధ్యతని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే ఇక నుంచి నడిపిన వారితో పాటు వాహన యజమానులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, డ్రైవింగ్ చేయడం, వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోవడం, నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేయడం, సగం సగం నంబర్ ప్లేట్లు కలిగి ఉండడం, మద్యం తాగి వాహనాలు నడిపితే మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎస్టీలను గుర్తించాలి

ఎల్లారెడ్డిపేటలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న దేవీలాల్

ఎల్లారెడ్డిపేట, జూన్ 30 : తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి పాలనావకాశం ఇచ్చిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ధన్యావాదాలు తెలిపుతూ, అన్ని పార్టీలు కూడా ఎస్టీలను గుర్తించి అవకాశం కల్పించాలని బంజారా సేవాలాల్ సంఘం మండలాధ్యక్షుడు భూక్యా దేవీలాల్ కోరారు. ఆదివారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార కాంగ్రెస్ కూడా నామినేటెడ్ పోస్టుల్లో మండల స్థాయి నాయకులుగా అవకాశం కల్పించాలని, ఇతర పార్టీలు సైతం సమర్ధతను కొలమానంగా పార్టీ పదవుల్లో గుర్తింపునివ్వాలన్నారు. ఇక్కడ ఆ సంఘం నాయకులు దరావత్ కల్యాణ్, మాలోత్ పూణ్యా, దరావత్ శంకర్‌నాయక్‌లున్నారు.

దుర్గామాత ఆలయంలో చోరీ

డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చందుర్తి, జూన్ 30: మండల కేంద్రం శివారులోని నవరత్నాల దుర్గామాత ఆలయంలో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తుల కథనం ప్రకారం, ఆలయ పూజారి మురళి రోజు మాదిరిగానే ఉదయం ఆలయం వద్దకు వెళ్లగా తలుపు తాళం పగులగొట్టి ఉంది. ఆలయ కమిటీ సభ్యులకు సమాచామిచ్చాడు.కమిటీ సభ్యులు వచ్చి ఆలయంలోకి వెళ్లి చూడగా దుర్గామాత విగ్రహంపై ఉండే పావు తులం పుస్తెలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోసుసులు జాగిలాలతో చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. ఈఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.2.50 లక్షల ఎల్వోసీ అందజేత

గంభీరావుపేట, జూన్ 30: మండల కేంద్రానికి చెందిన మంగలిపల్లె శిరీషకు మంజూరైన ఎల్వోసీని ఆదివారం మండల కాంగ్రెస్ నేతలు అందించారు. శిరీష అనారోగ్య పరిస్థితులు, వైద్య ఖర్చులపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్థానిక మండల అధ్యక్షుడు హమీద్ సమాచారం అందించారు. దీంతో స్పందించిన ప్రభుత్వ విప్ శిరీష వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్వోసీని మంజూరు చేశారు. వారి తల్లిదండ్రులు ఆది శ్రీనివాస్‌తో పాటు సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు హమీద్, పట్టణాధ్యక్షుడు పాపగారి రాజు, నేతలు చంద్రారెడ్డి, గౌరి శంకర్, రాజులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

విద్యానగర్, జూన్ 30: స్థానిక జ్యోతినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ గోదాదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం కరీంనగర్ పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి అమ్మవారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, సారె సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్, కాళేశ్వరం ప్రాజెక్టు మాజీ ఈఎన్సీ నల్ల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, పద్మశాలీయుల ఇంటి ఆడబిడ్డైన శ్రీ పద్మావతి అమ్మవారికి సంప్రదాయాన్ని అనుసరించి పట్టు వస్త్రాలు తలంబ్రాలు, సారె సమర్పించామన్నారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, పోపా జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎలిగేటి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కాచాపూర్‌లో కొండచిలువ కలకలం

శంకరపట్నం, జూన్ 30: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఇండ్ల మధ్య కొండచిలువ ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. ఓ పిల్లిని మింగుతుండగా గమనించిన గ్రామస్తులు దానిని కొట్టి చంపారు. గ్రామంలోని హనుమాన్ ఆలయానికి సమీపంలోని దారిలో జనావాసాల నడుమ ఓ కొండచిలువ ఓ పిల్లిని మింగుతున్న దృశ్యం అదే దారిలో వెళ్తున్న ఓ మహిళ కంట పడింది. వెంటనే ఆమె అరుపులకు అక్కడకు చేరుకున్న గ్రామస్తులు దానిని హతమార్చారు. అయితే అప్పటికే పిల్లి కూడా ప్రాణాలు కోల్పోయింది. జనావాసాల మధ్యకు అంత భారీ కొండచిలువ రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇక్కడ తరచూ చిన్న పిల్లలు ఆడుకుంటూ ఉంటారని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

కేపీఎల్ -5 టోర్నీ విజేతగా యంగ్ ఫైటర్స్ జట్టు

శంకరపట్నం, జూన్ 30: కేశవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో కేశవపట్నం ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేపీఎల్–5 టోర్నీలో యంగ్ ఫైటర్స్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. నెల రోజుల పాటు కొనసాగిన ఈ పోటీల పైనల్ మ్యాచ్ ఆదివారం జరిగింది. కేశవపట్నం ప్రీమియర్ లీగ్–5 విజేతగా యంగ్ ఫైటర్స్ జట్టు ఆవిర్భవించగా, రన్నరప్‌గా క్లాసిక్ వారియర్స్ జట్టు నిలిచింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. విజేతలకు ట్రోఫీలు అందజేశారు. విజేతలకు ఎంపీటీసీ ఏనుగుల అనిల్ ట్రోఫీలు స్పాన్సర్ చేశారు. సీనియర్ క్రీడాకారులు గాజుల శ్రీనివాస్, వంగోజు సంపత్, పూరెల్ల ప్రశాంత్, బొంగోని మధూకర్, బీసీ సంఘం మండలాధ్యక్షుడు బొంగోని అభిలాష్, ఆదర్శ యూత్ అధ్యక్షుడు చెరుకు శివకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

ఇల్లంతకుంట: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

ఇల్లంతకుంట, జూన్ 30 : మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పోచమ్మ బోనాలు తీశారు. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా గ్రామ దేవత పోచమ్మ ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. ఇక్కడ కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల చంద్రయ్యతోపాటు సంఘ సభ్యులున్నారు.

రుద్రంగిలో బోనాలతో వెళ్తున్న మహిళలు, సంఘం సభ్యులు

రుద్రంగి, జూన్ 30: మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం బోనాలు తీసుకెళ్లి పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. ఇండ్ల నుంచి మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్లతో సంఘ సభ్యులు, యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, యువకులు, మహిళలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

మానేరు జలాశయంపై 'క్లీన్ కరీంనగర్ డ్యాం'

రాంనగర్, జూన్ 30 : జలవిహార్ గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా క్లీన్ కరీంనగర్ డ్యాం కార్యక్రమంలో భాగంగా మానేరు డ్యాం కట్టపై ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు, చెత్తను తొలగిస్తూ జలాశయం పరిసర ప్రాంతాన్ని సుందరీకరిస్తున్నారు. ఆదివారం ఉదయం కరీంనగర్ మానేరు డ్యాం లేక్ వ్యూ పోలీస్ స్టేషన్ వద్ద, జలవిహార్ గ్రూప్ సభ్యులకు టీ షార్ట్, ఐడీ కార్డులను కరీంనగర్ వన్ టౌన్ సీఐ సరిలాల్, లేక్ వ్యూ ఎస్ఐ సురేశ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూమయ్య, జగ్గారెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

'విద్యా దోపిడీపై ఉద్యమాలు నిర్వహించాలి'

కమాన్‌చౌరస్తా, జూన్ 30: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న విద్యా వ్యాపారం, దోపిడీపై ఉద్యమాలు చేపట్టాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్(ఏఐకేఎఫ్) జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు పిలుపునిచ్చారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. మోర్తాల చందర్‌రావు హాజరై మాట్లాడారు. యాజమాన్యాలు, విద్యను వ్యాపారం చేస్తూ అడ్డుఅదుపు లేకుండా దోపిడీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోత్ రాజేశ్ నాయక్, రంగస్వామి, సహాయ కార్యదర్శి చంద గణేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్, తదితరులు పాల్గొన్నారు.